# మనిషి కాటు

అమ్మా! ఈ జావ కొంచెం వేడిచేసి ఇస్తావా?" అన్నదామె.

ఆవిడను రోజూ చూస్తూనే వుంటాను. వీధి చివర ఉన్న హోటల్ నుంచి గంటకోసారి గ్లాసుతో 'కాఫీ' నో, 'టీ'నో తెచ్చి ఆ చివరి వాటాలోకి తీసుకుపోతూ ఉంటుంది.

స్కూలుకు పోయే ఓ పదిహేనేళ్ళ కుర్రాడు మాత్రం కనపడుతూ ఉంటాడు. ఆవిడను ఈ వయసులో ఇన్నిసార్లు కాఫీ కోసం ఎవరు పంపుతుంటారా అని అనుకున్నాను చాలాసార్లు.

"లోపలికి రండి" అన్నాను.

"చీకటిలో కళ్ళు సరిగా కనపడవమ్మా! లైటు వేస్తే మా అబ్బాయి విసుగ్గా ఉందంటాడు. నిన్ను ఇబ్బంది పెడుతున్నానమ్మా" అందావిడ నొచ్చుకొంటూ.

"ఫరవాలేదు. రండి. ఊరికే వెచ్చజేసి ఇవ్వటం ఏం కష్టం. గేస్ మీద క్షణంలో వేడిచేసి ఇస్తాను." అంటూ ఆవిడను లోపలికి ఆహ్వానించేను. నేను లోపలికి పోయి వచ్చేదాక ఆవిడ వంగి పోయిన నడుమ్మీద చేతులు వేసుకొని అలాగే నిలబడి ఉంది.

"నాయనమ్మా"

బయటి నుంచి ఆ పిల్లవాడు పిలుస్తున్నాడు.

"మా మనవడమ్మా.... వెళతాను." అందావిడ గిన్నెకొంగుతో పట్టుకొని.

"ఇక్కడే ఉన్నానురా నాన్నా" అంటున్నది. వాకిటిలోకి వచ్చేడు ఆ అబ్బాయి. ఎప్పుడూ నవ్వినట్లు కనపడడు. మా కాంపౌండ్‌లో నాలుగైదు ఇళ్ళ

న్నాయి. ఆదివారాలు వస్తే పిల్లలు విపరీతమైన అల్లరి చేస్తారు. కానీ ఆ పిల్లవాడు మాత్రం నిశ్చలంగా, నిర్లిప్తంగా అలా చూస్తూ ఆ వరండాలోనే కూర్చుంటాడు. వాడికి ఆవిడ బయటే అన్నం పెడుతుంది. ఆ ఆదివారం మటుకు కాఫీ అవీ తెచ్చి, నీళ్ళు మోసి ముసలమ్మకు సాయం చేస్తాడు. ఆ మొహంలో అంతులేని దిగులు, ఆ వయసులో గంభీరంగా ఉండటం....యిదంతా నాకో పజిల్‌లా కనపడుతుంది.

"నువ్వు పలక్కపోయేసరికి భయం వేసింది...."

ఆ అబ్బాయి ఏడుస్తున్నాడు. నేను వరండాలో లైటు వేశాను....

"ఏమయిందయ్యా?" అన్నాను.

ముసలమ్మ ఆ అబ్బాయిని ఓదారుస్తోంది.

"ఎందుకు నాయనా ఏడుస్తావు.... నేనెక్కడికి పోతాను! బాబాయికి జావ కాస్త వెచ్చ జేసి ఇద్దామంటే చీకటిలో కనపడలేదు. లైటువేస్తే వాడు వద్దన్నాడు." అన్నదామె.

"మళ్ళీ ఏదో రాస్తున్నాడే. నేను లోపలికి వెళ్ళబోతే కర్ర విసిరేయబోయాడు. నేను బయటికొచ్చిపడ్డాను." అన్నాడు ఆ అబ్బాయి.

"మళ్ళీ కొట్టాడట్రా. ఎందుకు వెళతావు నాయనా. ఏముందీ వాడిని చూసేందుకు. చూసి నువు బతుకుతావుట్రా...."

ఆ ముసలమ్మ కూలబడిపోయి ఏడుస్తోంది. ఆ అబ్బాయి ముసలమ్మ చేతిలో గిన్నె అందుకున్నాడు చప్పున.

"నాయనమ్మా, బాబాయికి చెప్పవే. నేను చూస్తానని చెప్పవే. నాకు భయం లేదు. నేను చూడాలి. నన్ను లోపలికి రానిమ్మని చెప్పు."

ముసలమ్మ తెప్పరిల్లింది. చుట్టూ చూస్తోంది. నేను ఒక్క అడుగు ముందుకు వేసి, ఏమయిందని అడిగే లోపునే ఆ ముసలమ్మ బలహీనంగా నవ్వింది.

"వాళ్ళ బాబాయికి జబ్బు చేసింది. అదే వాడి భయం" ఆవిడ గొంతు బొంగురుపోయింది. ఇద్దరూ వెళ్ళిపోయారు. తెల్లారేక ఇంటి ఓనరు అద్దె కోసం వచ్చాడు. చివర గది ముందు కూర్చుని చాలాసేపు మాట్లాడేడు. ఆవిడ పెద్దపెట్టున ఏడుస్తోంది.

"వాడు చచ్చిపోతాడురా సాంబయ్యా.... నేను ఇదంతా ఎట్లా చూసేదిరా. అన్నం తినలేడు. మందులు పుచ్చుకోడు. కాఫీ తప్ప ఏదీ తాగడు వాడు కృశించిపోయాడు. కావాలని చావు తెచ్చుకుంటున్నాడు. నేనూ ఎప్పుడు చచ్చిపోతాడా అని

చూస్తున్నాను. ఎందుకంటే ఈ పడుతున్న నరకం కంటే చావే నయం వాడికి! పసి. వెధవను లోపలకి రానివ్వడు. వాడు బయటికి రాడు" ఆవిడ గొల్లుమని ఏడుస్తోంది.

"ఏడవకమ్మా, ఏం చేస్తాం. మనుష్యుల్ని నమ్మేడు వాడు. కళారాధనతో జీవితం మొత్తం గడిపేడు. పెళ్ళీ పెటాకులు లేకుండా ఆ నాటక సమాజం కోసం శ్రమపడ్డాడు. ఈ రోజు వాళ్ళకి పనికిరాలేదు. నన్నే లోపలికి రానివ్వలేదు వాడు. అద్దె వద్దంటే వప్పుకోడు. ఇదిగో ఇవి నువ్వే ఉంచుకో. వాడికి చెప్పకు. దేనికో దానికి ఉంటాయి." అంటున్నాడాయన కళ్ళు తుడుచుకుంటూ.

ఆయన్ని అడక్కుండా ఉండలేకపోయాను—

"ఆ ఇంటిలో మనుషులు చాలా చిత్రంగా ఉన్నారు. ఆ పసివాడు ఓ పెద్ద వేదాంతిలా ఉంటాడు. లోపలివాళ్ళెవరూ బయటికి రారు. ఈ పిల్లాడు లోపలికిపోడు. తిండి కూడా ఆ వరండాలోనే తింటాడు—వర్షం వచ్చినా సరే ఆ మూలనే పడుకుంటాడు. నాకు విచిత్రంగా ఉంది" అన్నాను.

"ఆ మునలమ్మ చెప్పలేదా....నువు మధుసూదన్‌ను ఎరుగుదువుకదా. నాటకాలు వేస్తాడూ...." అన్నాడాయన.

"సినిమా యాక్టర్ కూడా—అతనే కదా?"

"ఆ....అవును....చూసేవా....ఆ గదిలో మగ్గిపోయేది వాడే. చావుకు సిద్ధమయినాడు. మంచి మైమ్ యాక్టర్. డ్రెస్ కంపెనీ వుంది. చిన్నవయసు నుంచీ ఆ నాటక రంగానికే సర్వస్వం ధారపోశాడు. ఆ పిల్లాడు అన్న కొడుకు, అన్న, వదినే యాక్సిడెంట్‌లో పోయారు. ఆ పిల్లాడంటే ప్రాణం. కళ్ళల్లో పెట్టుకుని చూసుకుంటాడు...."

"అదేమిటి. వాడు లోపలికి వస్తే కొడతాడట. అదీ కర్ర విసిరి...." అన్నాను ఆశ్చర్యంగా.

ఆయన విట్టూర్చాడు.

"కొట్టడా?! కొట్టక ఏం చేస్తాడు! తన మొహం చూసి పసివాడు దడుసుకుంటాడేమోనని భయం! వాడికి గొంతు కాన్సర్. ముదిరిపోయి నాలుకబయటికి వచ్చేస్తోంది. పిల్లాడు బాధపడడూ! పాపం....ఈ రోగం వచ్చాక ఆ నాటక కంపెనీ వారికే తన డ్రెస్సు కంపెనీ అప్పగించాడు. నాటకానికి ఉపయోగించే మేకప్ సామాన్లు, సెట్టింగులు, తెరలు అన్నీ అద్దెకిచ్చి తనకు ఏదో కొంత డబ్బు ఇమ్మని కోరాడు. ముందు బాగానే ఇచ్చారు. వీడికి వ్యాధి ముదిరిపోయి మాట అర్థంకాని స్థితి వచ్చింది. తోటి నటులు, నాటకం కంపెనీవాళ్ళు మోసం చేశారు. ఎవరికి చిక్కనివి

వాళ్ళు తీసుకున్నారు. అడిగేందుకు వీడికి గొంతులేదు. పిల్లవాడు, ముసలమ్మ ఏం చేయగలరు? అలా దారుణంగా మోసం చేసింది వాడివి కళా ప్రపంచమే. వీడు సమాజము దగ్గరకుపోతే అసహ్యించుకొన్నారట....ఇలా బయటికి రావద్దు. జనం దడుసుకుంటారు'' అన్నారట హేళనగా. ఇన్నేళ్ళ సేవకు ప్రతిఫలం అది. అంతే-వాడికి మనుషులన్నా ప్రపంచం అన్నా అసహ్యం వేసింది. అలా లోపలికి పోయినవాడు మళ్ళీ బయటికి మొహం చూపించలేదు. మందులు వేసుకోలేదు. కోరి మృత్యువుని ఆహ్వానిస్తున్నాడు....'' సాంబయ్యగారు కళ్ళు తుడుచుకున్నాడు.

నేను నిర్ఘాంతపోయాను. ఎన్నో సభల్లో మధుసూదన్ వ్యాఖ్యాతగా వ్యవహరించటం చూశాను. హాస్యంగా నవ్విస్తూ చాలా చక్కగా మాట్లాడేవాడు. తెల్లని దుస్తుల్లో అందమైన రూపం నా కళ్ళముందు మెదిలింది.

'ఎంత దారుణం. మనుష్యులు ఇంత కిరాతకంగా ప్రవర్తించగలరా? కోరి చావుని ఆహ్వానిస్తున్నాడంటేనే అర్థం అయింది....ఈ ప్రపంచాన్ని మనుష్యులను ఎంత అసహ్యించుకున్నాడో'....కళ్ళ నీళ్ళు ఆపుకోలేకపోయాను. ఆ పిల్లవాడి ఏడుపే వినబడుతోంది.

''బాబాయ్....నాకు భయంలేదు. నీ దగ్గిరికి రానీయవా నన్ను. నువు మందులు వేసుకోవూ....నీ దగ్గరకు రాకుండా నేను ఉండలేను. నాయనమ్మా నువు చెప్పవే''ఆ పిల్లాడి హృదయవిదారకమైన ఏడుపు నన్ను కదలించివేస్తోంది.

కొందరు తెరముందు నటిస్తే మరికొందరు జీవితంలోనూ నటించగలరన్న మాట....

నేను నిస్సహాయంగా కూర్చుండిపోయాను.

ఉదయాన్నే నేను నిద్ర లేచేసరికి మైక్ మోగుతోంది. అంతా హడావుడిగా ఉంది. రోడ్డుమీద పెద్ద టెంట్ వేశారు. మైక్ పెట్టారు. చాలా మంది ఆడవాళ్ళు మొగవాళ్ళు ''రఘుపతి రాఘవ రాజారాం....'' అంటూ పాడుతున్నారు. బయటికి పరుగెత్తుకు పోయి చూశాను.

నోటి చుట్టూ ఓ టవల్ కట్టి వుంది. ఈనెపుల్లలాటి మనిషి ఆకారం నేను భరించలేకపోయాను. ముసలమ్మ, పిల్లవాడు ఎక్కడా కనుపించలేదు. నేను ఆ చివరి వాటాలోకి మొదటిసారిగా అడుగుపెట్టాను. గుండె దడదడ కొట్టుకొంది నాకు. దరిద్రం ఎంత భయంకరంగా వుంటుందో ఆ యిల్లుచూస్తే అర్థం అవుతుంది. స్టవ్, రెండు గిన్నెలు, కుండలు తప్ప ఆ ఇంట్లో ఏమీ లేవు. ఆ పిల్లాడు, ముసలమ్మ కూర్చుని వున్నారు. ఇద్దరి మొహాల్లో అదే నిర్లిప్తత. మైక్‌లో ఎవరో ఉపన్యాసం ఇస్తున్నారు. ''ప్రముఖ వక్త, నటుడు, దర్శకుడు మధుసూదన్ మరణించటం నాటక

రంగానికే తీరనిలోటు. నలభై ఏళ్ళ జీవితంలో అతను కళారంగానికి చేసిన సేవ అపూర్వం. ఈ రోజు చాలా దురదృష్టకరమైనరోజు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తున్నాను "

ఆ పిల్లవాడు అప్పటిదాకా దీక్షగా చదువుతున్న కాగితం వదిలేసి, "నాయనమ్మా" అంటూ ముసలామెను కౌగలించుకొన్నాడు. నేలపై అల్లల్లాడుతున్న కాగితం అందుకొన్నాను.

ముత్యాల్లాంటి అక్షరాలు.

**నాన్నా!**

నిన్ను, నానమ్మని ఒంటరిగా వదిలేసి పోతున్నాననే నాకు బెంగ. ఈ ప్రపంచం మనది కాదనుకున్నాక, ఈ మనుష్యులు, ఆప్యాయతలు ఏవీ మనవి కాదని తేలిపోయాక ఇందులో బతకటంలో నాకే ఆనందమూ కనపడలేదు. ఎన్నో నాటకాల్లో నటించాను. బహుమతులు అందుకున్నాను. చుట్టూ నిత్యం జరుగుతున్న అంతర్నాటకం చూడలేకపోయాను. అదే నా పొరపాటు. ఇంత భయంకరమైన ప్రపంచంలో నువ్వు, నానమ్మ ఎలా ఒంటరిగా బతుకుతారో! ఏడవకండి.... బహుశా ఏడవలేరు కూడా. ఎందుకంటే నేను పోగానే మన ఇంటి ముందే గొప్ప నాటకం జరుగుతుంది మీరే చూస్తారుగా....

మధు

నేను నీరసంగా నడుస్తూ బయటికి వచ్చాను. నిజంగానే బయట గొప్ప నాటకం. గొంతులో దుఃఖం, మాటల్లో సానుభూతి, మొహానికి విచారం - రంగు పులుముకున్న ఎందరో మహానుభావులు ఆ రంగస్థలంపైన కదులుతూ మాట్లాడుతూ పూలదండలు వేస్తూ....

నేను అలా చూస్తూ వుండిపోయాను. నాకు యేడుపు రాలేదు. పైగా ఈ కదిలే రంగుల బొమ్మలను చూస్తే నవ్వొస్తోంది కూడా. భారీ యేర్పాట్లు జరిగిపోతున్నాయి. లారీలో పూలపల్లకీ కట్టారు. నాటక సంఘాలవాళ్ళు, నటులు, దర్శకులు ఎందరో గొప్పవాళ్ళు దిగులు మొహాలతో వెనక నడుస్తోంటే మధుసూదన్ తన అంతిమ క్రియలకు భారీప్రదర్శనతో వెళ్ళిపోతున్నాడు. బతికి ఉండగా తిండికీ, ఆదరణకూ నోచుకోని ఆ అభాగ్యుడికి అపూర్వ సత్కారం మరణించేక. చూద్దామన్నా కన్నీటి తెరల్లో నేనేం చూడలేకపోతున్నాను. *

(1989 శుక్ల దీపావళి ప్రత్యేక సంచిక, ఆంధ్రజ్యోతి)